నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, సోమవారం 23 డిసెంబర్ 2024 | HYDERABAD




## ముత్యాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్సీ కవిత

సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని శ్రీ ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం బోనాల ఉత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. అమ్మవారిని ఎమ్మెల్సీ కవిత దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముత్యాలమ్మ ఆలయంలో బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించడం ఎంతో సంతోషకరమంటూ.. ఈ వేడుకల్లో తాను పాల్గొనడం సంతోషంగా ఉందని చెప్పారు. ఎమ్మెల్సీ కవిత వెంట సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ, మోండా డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు హరికృష్ణ తదితరులు ఉన్నారు.

*– మారేడ్‌పల్లి, డిసెంబర్ 22*



ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ తమిళ సంఘం ఆరో వార్షికోత్సవ సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి.

# బల్దియా బడ్జెట్ ఖరారు

**నేడు స్టాండింగ్ కమిటీ ముందుకు..**
**రూ. 8,440 కోట్లతో తాజా ముసాయిదా**
**గతంలో కంటే రూ. 100 కోట్లు పెరిగిన సవరణ బడ్జెట్**

సిటీబ్యూరో, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ ): ఎట్టకేలకు రానున్న ఆర్థిక సంవత్సరం (2025-26)కు సంబంధించిన బడ్జెట్‌ను ఖరారు చేశారు. రూ. 8,440 కోట్లతో తాజా ముసాయిదాను సిద్ధం చేసిన అధికారులు సోమవారం జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యుల ముందు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఫైనాన్స్ విభాగం అధికారులు వివరించనున్నారు. ఆదాయానికి, వ్యయానికి పొంతన లేదని గత స్టాండింగ్ కమిటీ సమావేశంలో అభ్యంతరాలు వ్యక్తం చేయడం.. బడ్జెట్ పారదర్శకంగా ఉండాలని సభ్యుల సూచనల మేరకు మార్పులు చేశారు. రూ. 8340 కోట్లతో రూపొందించిన బడ్జెట్ సభ్యుల సూచనల మేరకు బడ్జెట్‌ను రూ. 100కోట్ల మేర పెంచి రూ. 8440 కోట్లుగా బడ్జెట్‌ను సిద్ధం చేశారు. బల్దియాకు ఆదాయాన్ని సమకూర్చే ప్రాపర్టీ ట్యాక్స్, ట్రేడ్ లైసెన్స్, ఎస్టేట్స్, ప్రకటనల నుంచి రావాల్సిన రెవెన్యూ సక్రమంగానే చూపించారా? లేదా అన్నది ఈ స్టాండింగ్ సమావేశంలో తేలనున్నది.

### కేటాయింపులు ఇలా ..

హెచ్ సిటీ ప్రాజెక్టులకు రూ. 1237 కోట్లు, రహదారులకు రూ. 650 కోట్లు, సమగ్ర రోడ్డు నిర్వహణకు రూ. 185కోట్లు, నాలాలు, డ్రైయిన్లు రూ. 200 కోట్లు పార్కులు, పచ్చదనానికి రూ. 208 కోట్లు, చెరువులు, వారసత్వ కట్టడాల పరిరక్షణకు రూ. 173, అప్పులు రూ. 1933కోట్లు, ఇంకుడు గుంతలకు రూ. 72కోట్లు, ఇంజినీరింగ్ నిర్వహణ పనులకు రూ. 314, హెల్త్ శానిటేషన్ విభాగానికి రూ. 600కోట్లు కేటాయించారు. హౌసింగ్‌కు రూ. 300కోట్లు కేటాయింపులు జరిపారు.

### బడ్జెట్ సవరించారు ఇలా...

| అంశం | గత స్టాండింగ్ కమిటీ సమావేశం | ప్రస్తుతం (రూ.కోట్లలో) |
|---|---|---|
| రెవెన్యూ ఆదాయం | 4,445 | 4,205 |
| రెవెన్యూ వ్యయం | 4,000 | 3,936 |
| రెవెన్యూ మిగులు | 445 | 269 |
| క్యాపిటల్ ఆదాయం | 4440 | 4404 |
| క్యాపిటల్ వ్యయం | 4,440 | 4404 |

రెవెన్యూ వ్యయంలో రూ. 64 కోట్లు, క్యాపిటల్ వ్యయంలో రూ. 36 కోట్లు పెంచి సవరణ బడ్జెట్‌ను రూ.100కోట్లు పెంచారు. సవరణలో భాగంగా ఆస్తిపన్ను, టౌన్‌ప్లానింగ్, ట్రేడ్ లైసెన్స్, ప్రకటనలు ఫీజుల ద్వారా దాదాపు రూ. 228 కోట్లు ఆదాయం అదనంగా చూపారు. కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లను రూ. 419 కోట్ల నుంచి రూ. 279 కోట్లకు తగ్గించారు. కూడికలు, తీసివేతలతో మొత్తంగా రూ. 100కోట్లు పెంచారు.

## వీధి దీపాల పునరుద్ధరణకు చర్యలు

సిటీబ్యూరో: పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే కింద వీధి దీపాల పునరుద్ధరణపై హెచ్ఎండీఏ దృష్టి పెట్టింది. ఇటీవల కాలంలో తరచూ లైటింగ్ సమస్యలు తలెత్తున్న నేపథ్యంలో... వీటి నిర్వహణపై తీవ్ర విమర్శలొచ్చాయి. ముఖ్యంగా రాత్రి పూట ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో దీపాల మరమ్మతులు చేసేందుకు హెచ్ఎండీఏ చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఫ్లైఓవర్ కింద(డక్) భాగంలో ఎల్ఈడీ లైట్లకు మరమ్మతులు చేయనున్నారు. పిల్లర్ నుంచి 1-272 వరకు డక్ కింద లైటింగ్ కోసం రూ. 44 లక్షలతో ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు పాత వైరింగ్, ఎర్తింగ్, లైట్ ఫెయిల్యూర్ వంటి సమస్యలు లేకుండా ఉండేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నిత్యం ఎంసీబీ, లూజ్ వైరింగ్ కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోతుండటంతో యాన్యువల్ నిర్వహణలో భాగంగా పునరుద్ధరిస్తున్నట్లు హెచ్ఎండీఏ వర్గాలు పేర్కొన్నాయి. వచ్చే ఏడాదిలో పనులు ప్రారంభిస్తామని ఇంజినీరింగ్ అధికారులు వెల్లడించారు.

**88.89 లక్షల వాహనాలు..**

ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో 88.89 లక్షల వాహనాలున్నాయని సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి 48.81 లక్షల చలాన్లు వేసినట్లు చెప్పారు. సీసీఎస్‌లో గతేడాది 361 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 248 కేసులు నమోదయ్యాయన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రకటనలు చూసి ప్రీలాంచ్ ఆఫ్లర్లకు ఆకర్షితులై డబ్బు చెల్లించారని, అలాంటి కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా జరుగుతున్నదన్నారు. మోసం చేసిన వారి ఆస్తులను గుర్తించి అటాచ్ చేస్తున్నామని, కోర్టు ఆదేశాలతో ఆ ఆస్తులను వేలం వేస్తామన్నారు. డయల్ 100కు ఫోన్ చేస్తే 7 నిమిషాల్లోపే పోలీసులు సంప్రదిస్తున్నారన్నారు. ముత్యాలమ్మ ఆలయ ఘటన తరువాత నిరాశ్రయులై రోడ్లపై ఉండే వారికి షెల్టర్ ఇచ్చేందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. సైబర్ నేరాల్లో సుమారు రూ. 297 కోట్లు ప్రజలు నష్టపోయారన్నారు. ఈ ఏడాది గుజరాత్, రాజస్థాన్, సౌత్ ఇండియా మాడ్యుల్స్‌కు చెందిన వారిని భారీ స్థాయిలో అరెస్టు చేశామన్నారు. బ్యాంకింగ్ సిస్టమ్ సరిగ్గా లేకపోవడంతో సైబర్ నేరస్తులు కరెంట్ అకౌంట్స్ ఈజీగా సంపాదిస్తున్నారని, ఈ నేపథ్యంలోనే యాక్సిస్ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్, ఆర్‌బీఎల్ బ్యాంకు డిప్యూటీ మేనేజర్లను అరెస్టు చేశామన్నారు. మాదక ద్రవ్యాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.




సిటీ పోలీస్ వార్షిక నివేదికను విడుదల చేస్తున్న నగర సీపీ సీవీ ఆనంద్ ఇతర అధికారులు

# నేరాలు రెట్టింపు..

## భాగ్యనగరంలో పెరిగిన క్రైమ్ రేట్

**66 శాతం రెట్టింపైన దొంగతనాలు**

- **సైబర్ నేరాల్లో సుమారు రూ. 297 కోట్లు నష్టపోయిన ప్రజలు**
- **7 నిమిషాల్లో డయల్ 100 రెస్పాన్స్**
- **సిటీలో పోలీసింగ్‌పై పట్టులేని క్షేత్రస్థాయి సిబ్బంది**
- **నెమ్మదించిన కేసుల ఛేదన**
- **సిటీ పోలీస్ వార్షిక నివేదిక (2024)ను విడుదల చేసిన నగర సీపీ సీవీ ఆనంద్**
- **బౌన్సర్లు అతి చేస్తే ఊరుకునేది లేదంటూ..హెచ్చరిక**

సిటీబ్యూరో, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో భారీగా నేరాలు పెరిగాయి. దోపిడీలు, దొంగతనాలు, కిడ్నాప్, దాడులు ఇలా అన్ని రకాల నేరాలు పెరుగుతూ వెళ్లాయి. గతేడాది డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత హైదరాబాద్‌లో శాంతి భద్రతలు అదుపు తప్పాయి.నేరాల సంఖ్య పెరుగుతూ వెళ్లింది.. ఒంటరిగా నడుచుకుంటూ వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆదివారం నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ విడుదల చేసిన వార్షిక నివేదిక(2024)లో పలు అంశాలు ఇవీ.. నగర వ్యాప్తంగా ఈ ఏడాది 35,944 కేసులు నమోదయ్యాయి. అదే 2023లో ఈ సంఖ్య 25,488గా ఉండగా, ఇది 41 శాతం పెరుగుదల కనిపిస్తున్నది. ఇందులో ఆస్తులకు సంబంధించిన కేసులు గతేడాది 3,198 నమోదు కాగా, ఈ ఏడాది 5,328 నమోదయ్యాయి. అంటే దొంగతనాలకు సంబంధించిన కేసుల్లో 66 శాతం పెరిగాయని నివేదిక వెల్లడించింది. గత ఏడాది 67 శాతం కేసుల ఛేదన ఉండగా, ఈ ఏడాది 59 శాతానికి పడిపోయింది. ఈ ఏడాది జరిగిన పార్లమెంట్ ఎన్నికలు, అంతకు ముందు జరిగిన అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నగర పోలీస్ విభాగంలో భారీగా బదిలీలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలోనే ఎన్నికల నిబంధనల మేరకు హైదరాబాద్‌లో పని చేసిన వాళ్లు ఇతర జిల్లాలు, కమిషనరేట్లకు, అక్కడ పని చేసిన వాళ్లు హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. దీంతో జిల్లాలు, ఇతర కమిషనరేట్ల నుంచి వచ్చిన అధికారులకు హైదరాబాద్ పోలీసింగ్‌కు సంబంధించి పూర్తి అవగాహన లేకపోవడంతోనే నేరాలు పెరిగాయని అధికారులు పేర్కొంటున్నారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ పటిష్టంగా ఉండాలని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి సిటీ పోలీసింగ్‌పై అవగాహన సరిగా లేకపోవడంతో మొదట్లో కొంత తడబడ్డారన్నారు.

### ప్రధానమైన నేరాల వివరాలు 2023-2024

| నేరాలు | 2023 | 2024 |
|---|---|---|
| సొత్తు కోసం హత్యలు | 2 | 6 |
| బందిపోటు | 16 | 29 |
| దోపిడీలు | 101 | 219 |
| వివిధ రకాల దొంగతనాలు | 2694 | 3827 |
| హత్యలు | 89 | 77 |
| హత్యాయత్నాలు | 274 | 214 |
| కల్పబుల్ హోమిసైడ్ | 09 | 26 |
| లైంగిక దాడులు | 453 | 584 |
| కిడ్నాపులు | 172 | 324 |
| మోసాలు | 5250 | 5303 |
| సైబర్ నేరాలు | 21878 | 25831 |
| రోడ్డు ప్రమాదాలు | 2548 | 2745 |
| రోడ్డు ప్రమాద మరణాలు | 327 | 215 |

### ట్రై కమిషనరేట్ల సమన్వయంతో..

ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు రోప్‌ను వచ్చే ఏడాది మరింత పటిష్టంగా అమలు చేస్తామని సీపీ ఆనంద్ వెల్లడించారు. ఇందుకు టౌన్ వెండింగ్ కమిటీలను ఏర్పాటు చేస్తామని, ట్రై పోలీస్ కమిషనరేట్లను సమన్వయం చేసుకుంటూ ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పనిచేస్తామన్నారు. ట్రాఫిక్ విభాగం ప్రజలతో నిరంతరం ముడిపడి ఉంటుందని, ట్రాఫిక్ సాఫీగా వెళ్తే పోలీసులు బాగా చేస్తున్నారని ప్రజలు అనుకుంటారని, ట్రాఫిక్ సాఫీగా వెళ్లకపోతే ప్రజలు పోలీసుల పనితీరుపై విమర్శస్తారని, అందుకే ట్రాఫిక్‌పై ప్రధాన దృష్టి సారిస్తామన్నారు. సీసీ కెమెరాలపై స్పెషల్ ఫోకస్ పెడుతామని, పాడైన కెమెరాలను బాగుచేయడం, మరిన్ని కెమెరాలను ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

### అతి చేస్తే..ఉక్కుపాదం..

సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై సీపీ స్పందిస్తూ..బౌన్సర్ల ప్రవర్తన సరిగ్గా ఉండడం లేదని ఆయా ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా బౌన్సర్ పోలీసులను టచ్ చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. వీఐపీలు, వీవీఐపీలు తమ కార్యక్రమాలు నిర్వహించుకునే సమయంలో బౌన్సర్లకు, అక్కడి పరిస్థితులకు సంబంధించిన బాధ్యత వాళ్లదే ఉంటుందన్నారు. బౌన్సర్లు అతిగా చేస్తే..చర్యలు తీసుకుంటామన్నారు.

# ఖర్చు ఘనం..చెత్త పదిలం..!

- **గ్రేటర్‌లో కుప్పలు కుప్పలుగా పేరుకుపోతున్న వ్యర్థాలు**
- **అమలుకు నోచుకోని జీవీపీ పాయింట్ల ఎత్తివేత**
- **అటకెక్కిన తడి-పొడి చెత్త సేకరణ**
- **అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ**
- **ఏటా రూ.300కోట్లకు పైగా ఖర్చు**

సిటీబ్యూరో: గ్రేటర్‌లో పారిశుధ్య నిర్వహణ గాడి తప్పుతున్నది. చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దాల్సిన జీహెచ్ఎంసీ అమలులో పూర్తిగా విఫలమవుతున్నది. పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ, వ్యాధుల నివారణకు ఏటా రూ.300 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నా..లక్ష్యాన్ని మాత్రం సాధించలేకపోతున్నది. ఇంటింటికీ తడి, పొడి చెత్త సేకరణ, తరచూ చెత్త వేసే ప్రాంతాల (గార్బేజీ వనరేబుల్ పాయింట్లు/జీవీపీ) ఎత్తివేతలో అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనబడుతున్నది. గ్రేటర్ వ్యాప్తంగా చెత్త డబ్బాలను ఎత్తి వేయగా..ఇప్పటికీ 2640 చోట్ల చెత్త కుప్పలున్నట్లు అస్కి (అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా) సర్వేలో తేలడమే అధికారుల పనితీరును ప్రశ్నిస్తున్నది. ఈ నేపథ్యంలోనే ఎక్కడా చూసినా పెద్ద పెద్ద చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. వ్యర్థాలతో నిండిపోయిన బస్తీలు, కాలనీలు వెరసి దోమలతో దవాఖానల్లో పెరుగుతున్న వ్యాధి పీడితులతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. దీనికి కారణం అడుగడుగునా కొందరు అధికారుల అవినీతి లెక్కలు, రికార్డుల్లో తప్ప క్షేత్రస్థాయిలో కనిపించని సిబ్బంది..కాగితాల్లో మాత్రమే కనిపించే చెత్త తరలింపు..మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్ మొదలుకొని డిప్యూటీ కమిషన్ల వరకు ఆకస్మిక పర్యటనల లేమి వరకు లోపాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి.

### మళ్లీ గ్రేటర్ రోడ్లపై చెత్త సేకరణ పాయింట్లు

జీహెచ్ఎంసీ మళ్లీ డస్ట్ బిన్ల తరహాలో స్వీపింగ్ వేస్ట్ కలెక్షన్ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నది. రేకులతో దుకాణం మాదిరిగా షెడ్డు ఏర్పాటు చేసి అందులో చెత్త వేస్తే బయటకు కనిపించకుండా ఉండేలా ఏర్పాటు చేస్తున్నది. అక్కడి నుంచి గార్బేజ్ వెహికల్స్‌లో చెత్తను ట్రాన్స్‌ఫర్ స్టేషన్లకు తరలించనున్నారు. గ్రేటర్‌లోని 150 డివిజన్లలో ఒక్కొక్క పాయింట్ ఏర్పాటు చేయనున్నారు. తొలుత బస్తీలు, ఆ తర్వాత కాలనీల్లోని ముఖ్య కూడళ్లలో ఈ చెత్త సేకరణ పాయింట్ల ఏర్పాటుతో పారిశుధ్య నిర్వహణ, మెరుగైన ర్యాంకింగ్ సవాల్‌గా మారనున్నది.



బన్సీలాల్‌పేటలో పేరుకుపోయిన వ్యర్థాలు

### క్షేత్రస్థాయిలో మాత్రం..

గార్బేజ్ ఫ్రీ సిటీయే లక్ష్యమని జీహెచ్ఎంసీ చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం ఇందుకు విరుద్ధంగా పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రధానంగా ఉప్పల్ చిలుకానగర్ నుంచి నాచారం మెయిన్ రోడ్, కవాడిగూడ ప్రధాన రహదారి, బన్సీలాల్‌పేట, ముషీరాబాద్, షేక్‌పేట దర్గా, ఓయూ కాలనీలో రహదారుల పక్కనే చెత్త, నిర్మాణ వ్యర్థాలు వేసేస్తున్నారు. మాదాపూర్ కావూరి హిల్స్ ప్రధాన రహదారి, పర్వత్‌నగర్‌తో పాటు పాతబస్తీలోని 70 శాతం ప్రాంతాల్లో అపరిశుభ్రత తాండవిస్తున్నది. చార్మినార్ నుంచి గుల్జార్ హౌస్ వెళ్లే దారిలో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఎర్రగడ్డ ఆక్స్‌ఫర్డ్ స్కూల్ సమీపంలో కుప్పలు కుప్పలుగా చెత్త, ఇతర వ్యర్థాలతో భరించలేని దుర్వాసన వస్తున్నదని స్థానికులు చెబుతున్నారు. జోనల్, డిప్యూటీ కమిషనర్లు నిత్యం పరిధిలో పర్యటించాలి. కానీ అదెక్కడా జరగడం లేదు. జోనల్ కమిషనర్లు పెద్దగా పట్టించుకోకపోవడంతో చాలా మంది డిప్యూటీ కమిషనర్లు మధ్యాహ్నం తర్వాత కార్యాలయాలకు వస్తున్నారు. పారిశుధ్య విభాగంలోనూ కొందరు సక్రమంగా విధులకు రావడం లేదనే ఆరోపణలు లేకపోలేదు.

### స్వచ్ఛ ఆటోలపై పర్యవేక్షణ ఏదీ?

గ్రేటర్‌లో చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా దాదాపు మూడున్నరేండ్ల కిందట డస్ట్ బిన్ లెస్ సిటీ పేరుతో చెత్త కుండీలను జీహెచ్ఎంసీ ఎత్తేసింది. వందకు వంద శాతం ఇంటింటి చెత్త సేకరణకు స్వచ్ఛ ఆటోల సంఖ్యను పెంచారు. సుమారు 5,250 స్వచ్ఛ ఆటోల ద్వారా నగరంలో 4,886 కాలనీల్లో 23 లక్షల గృహాల నుంచి రోజుకు 7వేల మెట్రిక్ టన్నులకు పైగా చెత్త సేకరణ జరగాలి. ఒక్కొక్క ఆటోకు కాలనీ వారీగా చూస్తే ఒకటి లేదా రెండు కాలనీలు గృహాల ప్రకారంగా గమనిస్తే ఒక్కొక్క అటోకు సుమారుగా 500 నుంచి 600 ఇండ్లను కేటాయించి, చెత్త సేకరణ జరపాలి. కానీ గడిచిన కొన్ని రోజులుగా స్వచ్ఛ ఆటోల పనితీరు సరిగా ఉండటం లేదు. చాలా కాలనీలకు రోజూ స్వచ్ఛ ఆటోలు రావడం లేదు. వందకు వంద శాతం స్వచ్ఛ ఆటోల అటెండెన్స్ ఉండడం లేదు. రోజూ 1000 స్వచ్ఛ ఆటోలు పనిచేయడం లేదని స్వయంగా గత కమిషనర్ రోనాల్డ్ రాస్ గుర్తించారు. నేటికీ స్వచ్ఛ ఆటోల పనితీరుపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించింది. దీంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతున్నది.

## నేటి నుంచి ట్రాఫిక్ విధుల్లో ట్రాన్స్‌జెండర్లు

సిటీబ్యూరో: హైదరాబాద్ ట్రాఫిక్ విభాగంలో సోమవారం నుంచి ట్రాన్స్‌జెండర్లు విధులు నిర్వహించనున్నారని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో శిక్షణ పొందిన 39 మంది ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ విధుల నిర్వహణకు సంబంధించిన ట్రాఫిక్ గుర్తులు, డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ కుటుంబం, సమాజంలో ట్రాన్స్‌జండర్లు ఎంతో వివక్షకు లోనవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వాళ్లకు ఒక అవకాశం ఇవ్వాలని, వారిని సమాజంతో అనుసంధానం చేయాలనే ఉద్దేశంతో మొదటి సారిగా వారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ట్రాఫిక్ విభాగంలో హోంగార్డు క్యాడర్ కింద ట్రాఫిక్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహించేందుకు అవకాశం ఇచ్చినట్లు చెప్పారు.

## ఆ గ్రామపంచాయతీల పరిస్థితేంటి?

మేడ్చల్: రాష్ట్రంలో ప్రభుత్వం కొత్తగా 12 మున్సిపాలిటీలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వగా, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో కొత్త మున్సిపాలిటీల ఏర్పాటుపై నిర్ణయం తీసుకోకపోవడంపై 34 గ్రామ పంచాయతీలపై సందిగ్ధం ఏర్పడింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 61 గ్రామ పంచాయతీలు ఉండగా, ఇటీవలే ఇందులో నుంచి 28 గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీల్లో విలీనం చేసిన విషయం తెలిసిందే. అయితే మిగతా 34 గ్రామ పంచాయతీలను కొత్తగా మరో నాలుగు మున్సిపాలిటీలను ఏర్పాటు చేసి.. 34 గ్రామ పంచాయతీలను విలీనం చేస్తారని కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారు. కాగా, ప్రభుత్వం కొత్తగా మున్సిపాలిటీలు ఏర్పాటు చేసినా.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మాత్రం మున్సిపాలిటీల ఏర్పాటుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు. దీంతో 34 గ్రామ పంచాయతీల పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాలో 34 గ్రామ పంచాయతీలను అలాగే ఉంచుతారా లేక ఉన్న కొత్త మున్సిపాలిటీలను ఏర్పాటు చేస్తారా అన్నది మాత్రం అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు.

## నార్త్ సిటీ మెట్రోపై చిగురిస్తున్న ఆశలు

**విస్తరణ అంశం ముఖ్యమంత్రి పరిశీలనలో ఉందన్న మెట్రో వర్గాలు**

సిటీబ్యూరో, డిసెంబర్ 22(నమస్తే తెలంగాణ) : నార్త్ సిటీ మెట్రో విషయంలో ఆశలు చిగురిస్తున్నాయి. విస్తరణ అంశం పూర్తిగా సీఎం రేవంత్ రెడ్డి ఆధీనంలో ఉండటంతో... ఇటీవల నార్త్ సిటీ మెట్రో సాధన సమితి చేసిన ప్రయత్నం సఫలమవుతున్నది. ఈ మేరకు విస్తరణపై ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని, ఈ క్రమంలో గత కొంత కాలంగా మేడ్చల్ వరకు మెట్రో నిర్మించాలని చేస్తున్న డిమాండ్ సీఎం పరిశీలనలో ఉన్నదని మెట్రో వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే నార్త్ సిటీ ప్రాంతాలు లేకుండానే మెట్రో విస్తరణకు డీపీఆర్ సిద్ధం చేసి, కేంద్ర అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పంపింది. నార్త్ సిటీకి మెట్రోతో కూడిన డబుల్ డెక్కర్ ప్రతిపాదనలు ఉన్న నేపథ్యంలో... సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా శంకుస్థాపన చేసి ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే ఫోర్త్ సిటీ పేరిట నార్త్ సిటీని పరిగణనలోకి తీసుకోకుండానే ప్రతిపాదనలు రూపొందించడంతో కొంత గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. కానీ కొంతకాలంగా ఆ ప్రాంత వాసుల విజ్ఞాపనలను కూడా పరిగణనలోకి తీసుకునేలా చేసిన ప్రయత్నాలపై ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

### సీఎందే తుది నిర్ణయం..

76 కిలోమీటర్ల మేర ఫేస్-2 మెట్రో విస్తరణకు డీపీఆర్ సిద్ధం చేసింది. ఇందులో నార్త్ సిటీలోని ఏ ఒక్క ప్రాంతానికి చోటు కల్పించలేదు. దీనిపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన ఆ ప్రాంత వాసులు వరుసగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి చేశారు. అయితే డబుల్ డెక్కర్ లేకుండానే ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు ఉంటుందనే వాదనలు చర్చకు వచ్చాయి. ఈ సమయంలోనే నార్త్ సిటీ మెట్రో విషయంలో హెచ్ఎంఆర్ఎల్ ఉన్నతాధికారులను కలిసి విన్నవించారు. ఈ లోపే డీపీఆర్ ఫైనల్ చేయడంతో నార్త్ సిటీకి చోటు దక్కలేదు. కానీ ఫేస్-2లోనే నార్త్ సిటీ ప్రాంతాలను కలిపి మెట్రో నిర్మించేందుకు సీఎం నిర్ణయం కోసం మెట్రో వర్గాలు ఎదురుచూస్తున్నాయి. డబుల్ డెక్కర్ విషయంలో రైట్ ఆఫ్ వేకు ఆస్కారం తక్కువే ఉండటంతో... నార్త్ సిటీ మెట్రోపై పునరాలోచనలు చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ప్రక్రియ మొదలు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లుగా మెట్రో వర్గాలు పేర్కొన్నాయి.